- 8 MAR 2021 ENADU

## భాజపాలోకి ఎన్నార్ కాంగ్రెస్ నేత తిరుకోటి

**యానాం:** యానాం నియోజకవర్గం ఎన్నార్ కాంగ్రెస్ అభ్యర్థిగా 2016లో పోటీచేసిన మాజీ పోలీస్ అధికారి తిరుకోటి భైరవస్వామి ఆదివారం పుదుచ్చేరిలో కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, అధ్యక్షుడు సామినాథన్ సమక్షంలో భాజపాలో చేరారు. ఎన్.రంగసామి యానాం నుంచి అభ్యర్థిగా పోటీచేస్తున్న నేపథ్యంలో తిరుకోటి పార్టీని వీడడం చర్చనీయాంశమైంది.

## కల్యాణోత్సవాల నిర్వహణపై సమీక్ష

**యానాం:** యానాం మీసాల వెంకన్న కల్యాణోత్సవాలు ఈనెల 14 నుంచి మొదలవుతున్న నేపథ్యంలో అనువంశిక ఉత్సవదారులతో శ్రీవెంకటేశ్వర ఆలయ కమిటీ ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఆయా ఏర్పాట్లపై చర్చించినట్లు కాపగంటి ఉమాశంకర్ తెలిపారు.

## ఎన్నికల కోడ్ పాటించకుంటే చర్యలు

**యానాం:** ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని యానాం రిటర్నింగ్ అధికారి అమన్‌శర్మ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ఎస్పీ ఆర్.భక్తవత్సలన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు.

- 8 MAR 2021 SAKSHI

## ఎన్నికల నియమావళి అమలు చేయాలి

యానాం: నియోజకవర్గంలో ఎన్నికల నియమావళి అమలుపై రిటర్నింగ్ అధికారి అమన్‌శర్మ ఆదివారం ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. నిబంధనలు అతిక్రమిస్తే షోకాజ్‌నోటీసులు జారీచేస్తామని హెచ్చరించారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌ను కలుసుకోనున్నట్లు తెలిపారు. అలాగే పాఠశాలల్లో మధ్యాహ్న భోజన అమలుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

## 27న వెంకన్న రథయాత్ర

యానాం: స్థానిక శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఈనెల 27న రథయాత్ర నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిటీ ఆదివారం ప్రకటనలో తెలిపింది. 14 నుంచి వచ్చే నెల 6 వరకు స్వామివారి దివ్య కల్యాణాన్ని పురస్కరించుకుని ప్రతిరోజు వివిధ వాహనోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

## బీజేపీలోకి భైరవస్వామి

యానాం: ఎన్ఆర్ కాంగ్రెస్ శాఖ ఇన్‌చార్జి, విశ్రాంత ఎస్పీ తిరుకోటి భైరవస్వామి ఆదివారం బీజేపీలో చేరారు. 2016 ఎన్నికల్లో ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ మంత్రి మల్లాడిపై పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రస్తుత ఎన్నికల్లో ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీటును ఆశించి భంగపడడంతో బీజేపీలో చేరారు. పుదుచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ అధ్యక్షుడు స్వామినాథన్ సమక్షంలో పార్టీలో చేరారు.

## విషప్రయోగంతో ఆవుదూడలు మృతి

యానాం: విషప్రయోగంతో రెండు జెర్సీ జాతి ఆవుదూడలు మృతి చెందాయని కోన వెంకటరత్నం నగర్ నివాసి రెడ్డి సత్యశంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మేతకు వదలిన తమ పశువులు వేరొకరి స్థలంలో మేస్తుండటంతో వారు గుళికలను వేసి విషప్రయోగం చేశారని, దాంతో అవి మృతిచెందాయని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

- 8 MAR 2021 ANDHRA JYOTHI

## యానాంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

యానాం, మార్చి 7: యానాం నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అమన్‌శర్మ అన్నారు. ఆదివారం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యానాం ముఖ ద్వారాల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటుచేసి వాహనాలను తనిఖీలు చేస్తున్నట్టు చెప్పారు. 80ఏళ్లపైబడిన, దివ్యాంగులు, కొవిడ్ బాధితులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయవచ్చన్నారు. ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నియమావళి ఉల్లంఘిస్తే సి-విజిల్ మొబైల్ యాప్‌ద్వారా, టోల్‌ఫ్రీ నెంబరు 1950, కంట్రోల్ రూమ్08 84-2321223, వాట్సప్ 7382491950కు తెలపాలన్నారు.

### బీజేపీలో చేరిన తిరుకోటి

యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుకోటి భైరవ స్వామి పుదుచ్చేరిలో ఆదివారం బీజేపీలో చేరారు. యానాం అసెంబ్లీ స్థానం నుంచి ఎన్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ సీఎం ఎన్.రంగసామి పోటీ చేస్తారని మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు ప్రకటించిన నేపథ్యంలో తిరుకోటి బీజేపీలో చేరారు. యానాం బీజేపీ టికెట్ తిరుకోటికి ఇచ్చే అవకాశం ఉంది.

## రోగులకు మల్లాడి పరామర్శ

యానాం, మార్చి 7: యానాంలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు రోగులను మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో పలువురు మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

- 8 MAR 2021 ANDHRA PRABHA

## విష ప్రయోగంతో ఆవు దూడలు మృతి

**యానాం, ప్రభన్యూస్ :** యానాం కోన వెంకట్ రత్న నగర్ పరిధిలో శనివారం సాయంత్రం మేలు రకానికి చెందిన రెండు ఆవు దూడలు మృతి చెందాయి అయితే వాటి పై విష ప్రయోగం జరిగి వుండవచ్చని రైతు రెడ్డి సత్య శంకర్ యానం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం మేతకు వెళ్లిన రెండు ఆవు దూడలు సాయంత్రానికి విగతజీవులుగా పడి వున్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు ఆవు దూడలు పూర్తి ఆరోగ్యంతో వున్నాయని అయితే అవి విష ప్రయోగం కారణంగా మృతి చెందాయన్నారు ఎవరో కావాలనే వాటి పై విష ప్రయోగం చేసి వుంటారని ఆరోపిస్తున్నారు విష ప్రయోగనికి పాల్పడిన దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

- 8 MAR 2021
PRAJA SAKTHI



తనిఖీలు చేస్తున్న ఎస్పి

## ఎస్‌పి భక్తవత్సలం ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - యానాం

కేంద్రపాలిత ప్రాంతమైన యానాం ఉపసంచాలకుల కార్యాలయం వద్ద ఎస్‌పి భక్తవత్సలం సిఐ గూటం శివ గణేష్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డ్ విధులను, వారికి సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. విధుల్లో అలసత్వం వహించొద్దని సూచించారు.